డయేరియా నియంత్రణే ధ్యేయం

- గ్రామాల బాట పట్టిన వైద్య సిబ్బంది
- జాగ్రత్తలు పాటించాలని ప్రచారం


గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

కలిగిరి: జూన్‌లోనూ ఎండలు మండుతున్నాయి. అప్పుడప్పుడు వర్షాలు పడుతున్నప్పటికీ ఎండల తీవ్రత పెరుగుతూనే ఉంది. రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పిల్లలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో అతిసార వ్యాధి(డయేరియా) బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగా ఈనెల 16 నుంచి 31వ తేదీ వరకు అతిసార నియంత్రణ పక్షోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఎక్కువ ఎండలో పనిచేసే వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను పంపిణీ చేస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు అతిసార వ్యాధి బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలో పిల్లల తల్లులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి జాగ్రత్తలు వివరిస్తున్నారు.

చేయకూడని పనులు

తీవ్ర ఉష్ణోగ్రతలు ఉన్న సమయంలో బయట తిరగకూడదు. రోడ్ల పక్కన విక్రయించే ఆహారం, చల్లని రంగుల పానీయాలు తీసుకోకూడదు. మాంసాహారం తినడం తగ్గించాలి. మద్యం తాగడం మానేయాలి.

చేయాల్సిన పనులు

నీరు, పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. నలుపు, మందంగా ఉండే వాటికి బదులుగా లేత రంగుల్లో లభించే కాటన్ దుస్తులను మాత్రమే వినియోగించాలి. రోజూ కనీసం 15 గ్లాసులకు తగ్గకుండా నీటిని తాగాలి. పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఆహారాన్ని తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకోవాలి. ఎండ సమయంలో ఇంటి వద్దే ఉండాలి. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీలను ఉపయోగించాలి. పిల్లలను ఎండలో ఆడుకోవడానికి వెళ్లకుండా జాగ్రత్త పడాలి. ఇంట్లో కిటికీలను తీసి ఉంచాలి.

వ్యాధి బారిన పడితే..

ఎవరైనా అతిసార వ్యాధి బారిన పడితే వెంటనే చల్లని ప్రదేశానికి తరలించాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరుకునే వరకు చల్లని నీటిలో వస్త్రాన్ని తడిపి శరీరాన్ని తుడవాలి. చల్లని గాలి తగిలేలా ఏర్పాట్లు చేయాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు మరింత జాగ్రత్తలు పాటించాలి. విరేచనాలకు గురైన పిల్లలకు వైద్యుల సూచనల మేరకు తల్లిపాలు, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తగిన మోతాదులో జింక్ మాత్రలు వేయాలి.

ముందస్తు జాగ్రత్తలు చేపట్టాం



గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తల ద్వారా అతిసార వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. గ్రామంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నాం. తల్లులకు అవగాహన కల్పిస్తున్నాం.

– బిజ్జం గీతారెడ్డి, వైద్యాధికారిణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కలిగిరి

క్లుప్తంగా

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఏపీడీ ప్రతాప్‌రెడ్డి

సంగం: ఆత్మకూరు డివిజన్ పరిధిలో 13 వేల మందికిపైగా ఉపాధి కూలీలు పనిచేస్తున్నారని, వారి సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఉపాధి హామీ ఏపీడీ ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. సంగంలోని ఉపాధిహామీ పథకం కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలకు ఇబ్బందులు లేకుండా, పారదర్శకంగా పనులు కల్పించాలని సూచించారు.

25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

ఉదయగిరి: మండలంలోని ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు 25 శాతం ఉచిత ప్రవేశాలు తప్పనిసరిగా కల్పించాలని ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు అన్నారు. ఆయన మంగళవారం తన కార్యాలయంలో మండలంలోని ప్రైవేటు పాఠశాలలు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరెస్పాండెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉచిత ప్రవేశం కల్పించిన విద్యార్థులకు ప్రభుత్వం వారి ఖర్చు భరించి ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదును జమ చేస్తుందన్నారు. అధిక ఫీజులను వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో కరెస్పాండెంట్‌లు ప్రసాద్, సుధాకర్, భాస్కర్‌రెడ్డి, సుదర్శన్, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకునేలా చర్యలు


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ మోహన్‌రావు

సంగం: జిల్లాలో 15వ ఆర్థిక సంఘం నిధులు పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని జెడ్పీ సీఈఓ మోహన్ రావు తెలిపారు. సంగం ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, శానిటేషన్ పనులు తదితర అంశాలపై ఎంపీడీఓ షాలెట్‌తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు సంగం, మర్రిపాడు తదితర మండలాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు పూర్తిగా వినియోగించుకునేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా జిల్లాలో నిర్వహించే యోగా దినోత్సవం పూర్తిస్థాయిలో విజయవంతమైందన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

- ఐదుగురి అరెస్ట్


అదుపులోకి తీసుకున్న వారితో ఎస్సై, పోలీస్ సిబ్బంది

ఆత్మకూరు: మండల పరిధిలో ఓ పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఎస్సై జిలానీ కథనం మేరకు.. మండలంలోని రామస్వామిపల్లి గ్రామ శివారు పొలాల్లో పేకాట ఆడుతున్న విషయం తెలుసుకొని మంగళవారం సాయంత్రం సిబ్బందితో దాడి చేశారు. వారి వద్ద రూ.20,500 నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి వారిని కోర్టుకు హాజరు పరచనున్నామని ఎస్సై వివరించారు.

విద్యా సామగ్రి అందజేత



చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల దళితకాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక తొమ్మిదో వార్డు మెంబర్ సోమవరపు సంగీత విద్యా సామగ్రిని మంగళవారం అందజేశారు. పలకలు, నోట్‌బుక్స్, పెన్సిల్, రబ్బర్ తదితర ఎనిమిది రకాల సామగ్రిని, చాక్లెట్‌లను ఆమె పంపిణీ చేశారు. అనంతరం దాత సంగీతను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమణారెడ్డి, ఉపాధ్యాయిని సుప్రియ, స్థానికులు హజరత్తయ్య, సుబ్బరాయుడు, జయరామయ్య, పురుషోత్తం, యానాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యార్థుల సత్తా


వింజమూరు: గుండెమడకల పాఠశాల నుంచి ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం


ప్రతిభ చూపిన వింజమూరు బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు

వింజమూరు(ఉదయగిరి) : వింజమూరు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సత్తా చాటారు. మండలంలోని గుండెమడకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయితేజ (నూజివీడు), షణ్ముఖప్రియ (ఇడుపులపాయ), మధుప్రియ (ఒంగోలు) ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వింజమూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పాతర్ల ధనలక్ష్మి(నూజివీడు), సట్టా ధనుశ్రీ (ఇడుపులపాయ) విద్యార్థినులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు కూడా ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

- **దుత్తలూరు:** దుత్తలూరులోని ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించినట్లు ప్రిన్సిపల్ జె.సైమన్‌రావు తెలిపారు. పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ చాటిన ఎ.కీర్తన, సీహెచ్ సాత్విక ఇడుపులపాయకు, నిమ్మకాయల తనూశ్రీ ఒంగోలు ట్రిపుల్ ఐటీకి, ఖాసిం బీ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు ఆయన తెలిపారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది.


కీర్తన


సాత్విక


తనూశ్రీ


ఖాసిం బీ

ఉపాధ్యాయులకు సన్మానం



మర్రిపాడు: మండలంలోని చుంచులూరు ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయులు అశోక్, మురళీకృష్ణ, సయాంలను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయభాస్కర్ మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఎంతో నిబద్ధత, అంకితభావంతో పనిచేసి పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి ఎంతగానో కృషి చేశారన్నారు. విశ్రాంత ఎంఈఓ జొన్నా సత్యనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయిని అరుణ, గ్రామానికి చెందిన రాజేంద్ర కుమార్, సుబ్బయ్య, ఉపాధ్యాయులు డీవీ రమణయ్య, మల్లికార్జునస్వామి, పెంచలరావు, బాలాజీ, తిరుపాలు, రహీమ, శ్రీనివాసులు, సునీత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల భావోద్వేగం


ఉపాధ్యాయుడి సన్మాన కార్యక్రమంలో విలపిస్తున్న చిన్నారులు

మర్రిపాడు: చుంచులూరు ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా తొమ్మిదేళ్లు పనిచేసి ఉన్నత విలువలతో కూడిన బోధన చేసిన అశోక్ సన్మాన కార్యక్రమం మంగళవారం పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినులు భావోద్వేగానికి లోనయ్యారు. తమ టీచర్‌ను కొనసాగించాలంటూ బోరున విలపించారు. బదిలీల ప్రారంభంలో తమ జీవశాస్త్ర ఉపాధ్యాయుడిని ఇక్కడే ఉంచాలంటూ విద్యార్థులు గ్రామ పెద్దలను కలిశారు. ఎనిమిదేళ్లు పూర్తి కావడంతో బదిలీ తప్పదని వారు తెలపడంతో చిన్నారులు నిరాశగా వెనుదిరిగారు.

26 నుంచి మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

ఉదయగిరి రూరల్: మండలంలోని మహిళా సర్పంచ్‌లకు ఈనెల 26, 27, 28వ తేదీల్లో మహిళా సాధికారితపై ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో మూడు రోజులపాటు శిక్షణా తరగతులు జరుగుతాయని ఎంపీడీఓ అప్పాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 12 మంది మహిళా సర్పంచ్‌లు ఉన్నారన్నారు. వారు తప్పనిసరిగా శిక్షణకు హాజరు కావాలన్నారు.

నాగపూర్‌లో వింజమూరు మహిళ


మహారాష్ట్ర పోలీస్‌తో నాగరత్నమ్మ

వింజమూరు(ఉదయగిరి): మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఉన్న ఓ వైద్యశాలలో వింజమూరు బీసీ కాలనీకి చెందిన నాగరత్నమ్మ అనే మహిళ అనారోగ్యంతో చికిత్స పొందుతున్నట్లు స్థానిక ఎస్సై వీరప్రతాప్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు మహారాష్ట్ర పోలీసులు తమకు సమాచారం ఇచ్చినట్లుగా ఆయన తెలియజేశారు. తమది వింజమూరు బీసీ కాలనీ అని, తన భర్త పేరు సుబ్బారావు అని ఆ మహిళ చెబుతున్నట్లు వివరించారు. ఆమెను గుర్తుపట్టిన వారు తమకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

ముఖ హాజరుతోనే పౌష్టికాహారం పంపిణీ

ఉదయగిరి: అంగన్‌వాడీ కేంద్రాల్లో జూలై ఒకటో తేదీ నుంచి ముఖ హాజరుతో వచ్చే లబ్ధిదారులకు మాత్రమే పౌష్టికాహారం, సరుకులను పంపిణీ చేస్తామని సీడీపీఓ సునీత అన్నారు. ఆమె మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు ముఖ ఆధారిత గుర్తింపు యాప్ ద్వారా పంపిణీ చేస్తామని వివరించారు. ఇందుకు లబ్ధిదారులు సహకరించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

ఆత్మకూరు: రానున్న వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు క్లస్టర్ హెల్త్ కేంద్రం వైద్యురాలు అస్మా అన్నారు. ఆస్పత్రిలోని సమావేశ మందిరంలో ఏఎన్‌ఎంలు, నర్సులు, ఆశాలు, ఆరోగ్య సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. సిబ్బంది స్థానికంగా పర్యటిస్తూ ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



చేజర్ల(ఆత్మకూరు): బ్యాంకు ఖాతాదారులు, పొదుపు మహిళలు సైబర్ నేరాలపై తగిన అవగాహన ఉండాలని పలువురు వక్తలు అన్నారు. చేజర్లలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో పొదలకూరుకు చెందిన ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ పొదుపు మహిళలకు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ క్రైమ్‌లు తదితర అంశాలపై మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. వెలుగు ఏపీఎం సుజీవన, ట్రీస్ సంస్థ కార్యదర్శి మహమ్మద్‌లు పలు అంశాలను పొదుపు మహిళలకు వివరించారు. బ్యాంక్ లావాదేవీలు, ఓటీపీలు, ఫోన్ల ద్వారా ఖాతా వివరాలు అడిగేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వెలుగు సీసీలు నారాయణమ్మ, సుధాకర్ పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం

దుత్తలూరు: పచ్చిరొట్ట ఎరువుల ద్వారా భూసారం పెరుగుతుందని ఇన్‌చార్జి ఏఓ పి.సుస్మిత తెలిపారు. మండలంలోని బ్రహ్మేశ్వరం, భైరవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఎరువుల యాజమాన్యం, సేంద్రియ ఎరువుల వాడకం గురించి వివరించారు. వీఏఏ దినేష్ పాల్గొన్నారు.

- **చేజర్ల(ఆత్మకూరు):** చేజర్ల మండలంలోని కోటితీర్థం, యనమదల గ్రామ పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ హిమబిందు నిర్వహించారు. పచ్చిరొట్ట పైర్ల ఆవశ్యకతను వివరించారు. ఏఈఓ సుజాత, వీఏఏలు హేమలత, హసన్‌కుమార్ పాల్గొన్నారు.
- **సీతారామపురం:** సీతారామపురం బిట్–1, 2 సచివాలయాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ చెన్నారెడ్డి నిర్వహించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఏఈఓలు సుధీర్‌కుమార్, సాంబశివయ్య, వీఏఏలు ఫజిహా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.
- **ఉదయగిరి రూరల్:** మండలంలోని అప్పసముద్రం, నేలటూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఇన్‌చార్జి ఏఓ పి.విజయభాస్కర్ పలు సూచనలు చేశారు. మొక్కజొన్నలో ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ చర్యలపై వివరించారు. ఏఈఓ వినోద్, వీఏఏలు స్రవంతి, శేఖర్ పాల్గొన్నారు.
- **సంగం:** మండలంలోని తరుణవాయి, పడమటిపాళెం రైతు సేవా కేంద్రాల్లో ఏఓ శశిధర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో వచ్చే చీడపీడలు, వాటి నివారణ చర్యలను వివరించారు. అనంతరం మండలంలోని ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.
- **సోమశిల:** అనంతసాగరం మండల పరిధిలోని లింగంగుంట, మంచాలపల్లి గ్రామాల్లో ఏఓ శైలజాకుమారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు.

రేషనలైజేషన్ తర్వాతే బదిలీలు చేపట్టాలి


సంగం: ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

సంగం: సచివాలయ ఉద్యోగులకు రేషనలైజేషన్ పూర్తయిన తరువాతే బదిలీల ప్రక్రియ చేపట్టాలని వారు కోరారు. ఈ మేరకు మండల సచివాలయ ఉద్యోగులు ఎంపీడీఓ షాలెట్, తహసీల్దార్ సోమ్లా నాయక్‌లను వారి కార్యాలయాల్లో కలిసి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరు తూ మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. తమకు స్పష్టమైన జాబ్ చార్ట్ ఇచ్చి సర్వీస్ రూల్స్ అమలు చేసిన తరువాతే బదిలీలు నిర్వహించాలని కోరారు. బదిలీల ప్రక్రియ సీనియారిటీ ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలన్నారు. సచివాలయ ఉద్యోగులను సొంత మండలాల్లో పనిచేసేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

బదిలీల ప్రక్రియను నిలిపివేయాలి

సీతారామపురం: గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే సిబ్బందిని రేషనలైజేషన్ ద్వారా బదిలీ చేసే ప్రక్రియను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని కోరుతూ మండల సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు మంగళవారం ఎంపీడీఓ భార్గవికి ఆమె కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము గత ఆరేళ్లుగా గ్రామస్థాయిలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, సర్వశిక్ష అభియాన్, గృహ నిర్మాణ సంస్థ తదితర ఇంజినీరింగ్ పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, పలు సర్వేలు ఏకకాలంలో నిర్వహిస్తున్నా ప్రభుత్వం తమకు ఎలాంటి ప్రమోషన్లు కల్పించడం లేదని వాపోయారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన రేషనలైజేషన్‌లో భాగంగా రెండు లేదా మూడు సచివాలయాలు కలిపి ఒక క్లస్టర్‌గా చేసినందువల్ల క్షేత్రస్థాయిలో తమపై ఒత్తిడి తీవ్రంగా పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత మండలంలో పనిచేయకూడదనే నిబంధన సచివాలయ ఉద్యోగులకు మాత్రమే అమలు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఈనెల 28వ తేదీ వరకు ప్రతిరోజు వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ల మండలాధ్యక్షుడు బాలినేని ప్రవీణ్‌కుమార్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సుమతి, అంకయ్య, జాన్సన్ పాల్గొన్నారు.


సీతారామపురం: ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

సమస్యలు పరిష్కరించాలని..

మర్రిపాడు: గ్రామ సచివాలయాల్లో పనిచేసే ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎంపీడీఓ నాగేశ్వరప్రసాద్‌కు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓఎంఎస్ 5ను సవరించి స్థానిక మండలంలోనే ఉద్యోగం చేసే వెసులుబాటు కల్పించాలని కోరారు.


మర్రిపాడులో..

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు


సీతారామపురం: బోల్తాపడిన డీసీఎం వాహనం


సీతారామపురం: గాయపడిన క్లీనర్


సీతారామపురం: గాయాలపాలైన డ్రైవర్

సీతారామపురం: సెంట్రింగ్ సామగ్రితో హైదరాబాద్ నుంచి సీతారామపురం వస్తున్న ఓ డీసీఎం వాహనం మార్గమధ్యలోని సీతారామపురం– పోరుమామిళ్ల ఘాట్ రోడ్డు మార్గంలో ఓ మలుపు వద్ద మంగళవారం ఉదయం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవరు గౌస్, క్లీనర్ యూసుఫ్‌కు గాయాలయ్యాయి. వివరాల్లోకెళ్తే.. మండలంలో జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనుల కోసం హైదరాబాద్ నుంచి సెంట్రింగ్ సామగ్రితో వస్తున్న డీసీఎం వాహనం ఘాట్‌రోడ్డులోని ఓ మలుపు వద్దకు రాగానే బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపుతప్పింది. వాహనాన్ని అదుపు చేయలేక డ్రైవర్, క్లీనర్ ఇద్దరూ ఒకేసారి బయటకు దూకేయడంతో గాయాలపాలయ్యారు. డ్రైవర్ గౌస్ తలకు గాయాలు కాగా క్లీనర్ యూసుఫ్‌కు కాలు విరిగింది. క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా

ఉదయగిరి రూరల్: ఇసుక ట్రాక్టర్ బోల్తా పడి పలువురు కూలీలు తీవ్రంగా గాయపడిన ఘటన వరికుంటపాడు మండలంలోని తూర్పు బోయమడుగుల గ్రామ సమీపంలో మంగళవారం జరిగింది. సేకరించిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కాంచెరువు గ్రామానికి చెందిన ఓ ట్రాక్టర్ కూలీలతో వెళ్లి తూర్పు బోయమడుగుల గ్రామ సమీపంలోని వాగులో ఇసుకను లోడ్ చేసుకుని తిరిగి కాంచెరువు వెళ్తుండగా వాగులో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో సుభాషిణి, లక్ష్మీరాజ్యం, నాగేశ్వరరావులకు తీవ్ర గాయాలు కాగా డ్రైవర్ చెన్నయ్య, లక్ష్మీప్రసన్నకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వరికుంటపాడు ఎస్సై రఘునాథ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ట్రాక్టర్

ఉదయగిరి: ఆర్టీసీ బస్సును ఇసుక ట్రాక్టర్ ఢీకొన్న ఘటన గండిపాళెం గ్రామ సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఉదయగిరి ఆర్టీసీ డిపోనకు చెందిన బస్ సర్వీసు పామూరు నుంచి బెంగళూరుకు వెళ్తోంది. ఈ క్రమంలో గండిపాళెం సమీపంలో ఇసుక ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం కొంతమేర దెబ్బతింది. ప్రమాదం గురించి బస్సు డ్రైవర్ పోలీసులకు తెలియజేశారు. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు



కలిగిరి: క్రాకుటూరు, వెలగపాడు ప్రాథమిక పాఠశాలల్లో జిల్లా ఫ్లోరోసిస్ నివారణ వైద్యాధికారిణి దివ్య మంగళవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఫ్లోరోసిస్ వల్ల దంత సమస్యలు ఉన్న విద్యార్థులకు విటమిన్ – సీ మాత్రలను పంపిణీ చేశారు. పిల్లలు ఫ్లోరోసిస్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కలిగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్ల సమర్పణ

ఉదయగిరి రూరల్: మండలంలోని సున్నంవారిచింతల గ్రామంలో మంగళవారం గ్రామదేవత పోలేరమ్మ తల్లికి మహిళలు పొంగళ్లు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు పొంగలి సామగ్రితో డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య గ్రామోత్సవంగా ఆలయానికి చేరుకున్నారు. ప్రదక్షిణల అనంతరం సామూహికంగా పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.